సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 19 । జనవరి । 2024



వాహనాల రద్దీ
హైదరాబాద్– విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ గురువారం కూడా కొనసాగింది. - 8లో



భాగస్వాములు కావాలి
విద్యార్థుల గ్రామావృద్ధిలో భాగస్వాములు కావాలని ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి గీత పేర్కొన్నారు. - 10లో



ఆర్టీసీ బస్సుల్లో సిగపట్లు!
యాదాద్రి కొండపై బస్సుల్లో సీట్ల కోసం భక్తులు పోటీపడ్డారు. ఈ క్రమంలో వాగ్వాదం చోటు చేసుకుంది. - 10లో

న్యూస్‌రీల్

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

తుర్కపల్లి : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తుర్కపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. చేర్పులు, మార్పుల కోసం కూడా ఈనెల 22వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. అదే విధంగా వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి ఉపాధిపనులపై ఆరా తీశారు. లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేశ్యనాయక్, ఎంపీడీఓ ఉమాదేవి, ఈజీఎస్ఆర్డీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



చెక్‌డ్యాం పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ వీరారెడ్డి గురువారం పరిశీలించారు. పొర్లగడ్డ, గోసుకొండ, వావిళ్లపల్లి నిర్మిస్తున్న చెక్‌డ్యాంలు, జనగాంలో నిర్మాణం పూర్తయిన ఊటకుంటలు, గుడిమల్కాపురం నర్సరీని ఆయన పరిశీలించారు. ఆయన పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీపడవద్దని అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఆర్‌డీవో పీడీ నాగిరెడ్డి, ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నర్సింహారావు, ఏపీఓ ప్రశాంతి, ఈసీ లహరి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఎమ్మెల్యేల శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీర్ల అయిలయ్య, అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి,యాదాద్రి : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ నుంచి బల్మూరి వెంకట్, మహేష్ కుమార్‌గౌడ్ గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. అభ్యర్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అయోధ్యకు రావాలని గూడూరుకు ఆహ్వానం



గూడూరు నారాయణరెడ్డికి ఆహ్వానపత్రిక ఇస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకుడు శ్రీధర్‌జీ

సాక్షి, యదాద్రి : అయోధ్య రామమందిరంలో ఈనెల 22న నిర్వహించనున్న శ్రీ రామయ్య విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డికి ఆహ్వానం అందింది. గురువారం ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌జీ నారాయణరెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి ఆహ్వానం అందడం తన పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు.

‘రీజినల్’పై ఫోకస్

సీఎం ప్రకటనతో కదిలిన యంత్రాంగం

- భువనగిరి పరిధిలో భూ సేకరణకు సన్నాహాలు
- న్యాయ వివాదాలపై దృష్టి
- ప్రభుత్వానికి రెండు రోజుల్లో నివేదిక అందజేయనున్న అధికారులు
- పరిహారంపై నిర్వాసితుల్లో ఆందోళన



సాక్షి, యాదాద్రి : రీజినల్ రింగ్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ఆ దిశగా యంత్రాంగం చర్యలు చేపట్టింది. భూ సేకరణకు ఉన్న అడ్డంకులపై దృష్టి సారించింది. హైకోర్టు స్టేతో ఇప్పటికే భువనగిరి పరిధిలో భూ సేకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. కోర్టుల్లో నడుస్తున్న వివాదాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి సమర్పించేందుకు నివేదిక సిద్ధం చేస్తోంది. రెండు,మూడు రోజుల్లో అందజేయనున్నారు.

సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు

సంగారెడ్డిలోని గిర్మాపూర్ నుంచి మెదక్, సిద్దిపేట జిల్లాల మీదుగా యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ వరకు హైదరాబాద్‌కు ఉత్తర భాగం తొలి విడతలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించనున్నారు. 59.656 కిలో మీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా భూసేకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల పరిధిలోని 34 రెవెన్యూ గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు.

స్థిరాస్తుల తొలగింపునకు కసరత్తు

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ఇప్పటికే శాటిలైట్ ద్వారా రూపొందించిన మ్యాప్ ప్రకారం హద్దులు పాతిన విషయం తెలిసిందే. రెవెన్యూ గ్రామాల వారీగా సర్వే నంబర్లతో గెజిట్ కూడా వచ్చింది. ఏ సర్వే నంబర్‌లో ఎంత భూమి, కట్టడాలు, వ్యవసాయ బావులు, తోటలు తదితర అంశాలు కూడా తేలాయి. ఇక రోడ్డు నిర్మించే మార్గంలో విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైపులైన్లు, చెట్లు, కట్టడాల వంటి స్థిరాస్తులను మార్చడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

చౌటుప్పల్ ఆర్డీఓ పరిధిలోని గ్రామాలు

చౌటుప్పల్ మండలంలో చిన్నకొండూరు, చౌటుప్పల్, లింగోజిగూడెం, పంతంగి, నేలపట్ల, తాళ్లసింగారం, స్వాములవారిలింగోటం, తంగెడుపల్లి, వలిగొండ మండలంలోని వర్కట్‌పల్లి, గోకారం, పొద్దటూరు, వలిగొండ, సంగెం, పహిల్వాన్‌పూర్, కంచన్‌పల్లి, టేకుల సోమారం, రెడ్లరేపాక రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.

భువనగిరి ఆర్డీఓ పరిధిలో..

భువనగిరి మండలంలోని రాయగిరి, భువనగిరి, కేసారం, పెంచికల్‌పహాడ్, తుక్కాపూర్, చందుపట్ల, గౌస్‌నగర్, ఎర్రంబల్లి, నందనం గ్రామాలు.

యాదగిరిగుట్ట పరిధిలో..

యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపూర్, దాతరుపల్లి, తుర్కపల్లి మండలంలో గంధమల్ల, వీరారెడ్డిపల్లి, కొండాపూర్/కోనాపూర్, ఇబ్రహీంపూర్, దత్తాయిపల్లి, వేల్పల్లి గ్రామాలు ఉన్నాయి.

పరిహారంపై నిర్వాసితుల్లో గుబులు

భూసేకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో రాయగిరి పరిధిలోని బాధిత రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే జాతీయ రహదారి, విద్యుత్ టవర్లు, కాళేశ్వరం కాలువల కోసం భూములు కోల్పోయారు. తాజాగా మరోసారి రీజినల్ రింగ్ రోడ్డు కోసం భూములు కోల్పవలసి వస్తుంది. కాగా బహిరంగ మార్కెట్ ఎకరం రూ.కోట్లలో పలుకుతోంది. అయితే ప్రభుత్వం పరిహారం ఎంత ఇస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పెంచిన ఆస్తులు, భూముల విలువ ప్రకారం ఇస్తుందా లేక పాత ధర ప్రకారం చెల్లిస్తుందా.. అనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. పెంచిన విలువ ప్రకారం పరిహారం ఇచ్చినా బహిరంగ మార్కెట్ ధరతో పోలిస్తే చాలా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

కోర్టుకెళ్లిన రాయగిరి రైతులు

అసెంబ్లీ ఎన్నికలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వివాదాలు, కోర్టు వ్యవహారాల నేపథ్యంలో భూసేకరణ నిలిచిపోయింది. చౌటుప్పల్, భువనగిరి, యాదగిరిగుట్ట.. మూడు విభాగాలుగా విభజించి భూ సేకరణ ప్రక్రియ ప్రారంభించారు. అయితే తాము ఇప్పటికే ప్రజాప్రయోజనాల కోసం మూడు పర్యాయాలు భూములు ఇచ్చామని, మళ్లీ ఇవ్వలేమని రైతులు పలుమార్లు గత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. తమకు జీవనాధారమైన భూములు కాపాడాలని బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే ఇవ్వడంతో భూ సేకరణ నిలిచిపోయింది.

అవిశ్వాసాల రగడ

- మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ చైర్మన్లను దింపడంపై కాంగ్రెస్ దృష్టి
- ఉమ్మడి జిల్లాలోని పలు పురపాలక సంఘాల్లో ఇప్పటికే కౌన్సిలర్ల తీర్మానాలు
- ఇటీవల నల్లగొండ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం
- రానున్న పది రోజుల్లో ఆరు మున్సిపాలిటీల్లో అవిశ్వాస సమావేశాలు
- బీఆర్ఎస్ చైర్మన్లకు పొంచి ఉన్న పదవీ గండం



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం కాపీ అందజేస్తున్న భువనగిరి కౌన్సిలర్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్లను అవిశ్వాస గండం వెంటాడుతోంది. బీఆర్ఎస్ చైర్మన్లు ఉన్న మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసానికి సై అంటున్నారు. అధికార పార్టీలోకి బీఆర్ఎస్ కౌన్సిలర్ల చేరికలను ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ పార్టీ తన పట్టు బిగిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో నల్లగొండ మున్సిపాలిటీలో అవిశ్వాసం నెగ్గించుకున్న కాంగ్రెస్.. మిగితా మున్సిపాలిటీల్లోనూ అవిశ్వాసాలకు తెరలేపింది.

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే నోటీసులు

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కొన్ని చోట్ల అవిశ్వాసం కోసం కౌన్సిలర్లు అధికారులకు నోటీసులు ఇచ్చారు. కానీ, ప్రభుత్వం స్పందించక పోవడంతో అవిశ్వాస సమావేశాలు జరగలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు మూడేళ్ల పదవీ కాలం పూర్తయిన మున్సిపాలిటీల్లో అవిశ్వాసం పెట్టుకునేందుకు వీలు ఏర్పడటంతో వివిధ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ నేతలు అవిశ్వాసాలకు తెరలేపారు. పలు మున్సిపాలిటీల్లో ఇప్పటికే అవిశ్వాస రగడ కొనసాగుతోంది. మరికొన్ని చోట్ల ఆ దిశగా పావులు కదులుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందే చౌటుప్పల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరడంతో అవిశ్వాస తంటా తప్పింది.

నల్లగొండలో నెగ్గిన అవిశ్వాసం

నల్లగొండ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్, వైస్ చైర్మన్లు ఉన్నారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల ముందు వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌తోపాటు మరికొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్‌లో నుంచి నలుగురు కౌన్సిలర్లు మినహా అంతా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఈ నెల 8న చైర్మన్ మందడి సైదిరెడ్డిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి నెగ్గారు. దీంతో మిగతా మున్సిపాలిటీల్లో కూడా కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసాలను ముందుకు తెస్తున్నారు.

నందికొండలో స్టే

నాగార్జునసాగర్ పరిధిలోని నందికొండ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్లపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు అధికారులకు తీర్మానం కాపీ అందించగా అధికారులు కూడా అవిశ్వాస సమావేశం పెట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే, వైస్ చైర్మన్ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో అవిశ్వాసం నిలిచిపోయింది.

23న భువనగిరిలో..

భువనగిరి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు గత నెల 28న కలెక్టర్‌కు తీర్మానం కాపీని అందజేశారు. ఈ నెల 23న అవిశ్వాసానికి అధికారులు కౌన్సిలర్లకు నోటీసులు అందజేశారు. ఇక్కడ 16 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు తిరుగుబాటు చేసి అవిశ్వాసానికి తెరలేపారు. తిరుగుబాటు చేసిన కౌన్సిలర్లకు 9 మంది కాంగ్రెస్, ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మద్దతుగా నిలిచారు.

23న నేరేడుచర్లలో..

నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబుపై అవిశ్వాసం పెట్టేందుకు ఈ నెల 23న సమావేశం జరగనుంది. గత సంవత్సరం నవంబర్ 2న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చల్లా శ్రీలతారెడ్డి తన పదవికి, కౌన్సిలర్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉండగా ఒకరు రాజీనామా చేయడంతో 14 మంది ఉన్నారు. ఇందులో 12 మంది మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు తీర్మానంపై సంతకాలు చేశారు.

24న హుజూర్‌నగర్‌లో వైస్ చైర్మన్‌పై..

హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావుపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఈ నెల 24న సమావేశం ఏర్పాటు చేయనున్నారు. మున్సిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లు ఉండగా చైర్ పర్సన్‌తో పాటు 17 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి కలెక్టర్‌కు అందజేశారు. మరికొంత మంది కౌన్సిలర్లు కూడా అవిశ్వాసానికి మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

చౌటుప్పల్‌లో లేనట్లే..

చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ అసెంబ్లీ ఎన్నికల ముందే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో ప్రస్తుతం అవిశ్వాస గండం తప్పినట్లయింది.

27న సూర్యాపేట, ఆలేరు, కోదాడలో అవిశ్వాసం

సూర్యాపేట, ఆలేరు, కోదాడ మున్సిపాలిటీల్లో అవిశ్వాస సమావేశాలు ఈ నెల 27న నిర్వహించేందుకు అధికారులు నోటీసులు జారీచేశారు. ఆలేరు మున్సిపల్ చైర్మన్ శంకరయ్యపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు గత నెల 10వ తేదీనే కౌన్సిలర్లు అధికారులకు నోటీసులు ఇచ్చారు. కానీ అవిశ్వాసం పెట్టలేదు. తిరిగి ఈ నెల 9న అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్‌కు తీర్మానం కాపీని అందజేశారు. దీంతో 27వ తేదీన అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమయ్యారు. అదే విధంగా కోదాడ మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్‌కు తీర్మానం కాపీ ఇచ్చారు. ఈ నెల 17వ తేదీనే అవిశ్వాసం పెట్టాల్సి ఉండగా, దాన్ని 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కోదాడలో మొత్తం 35 వార్డులు ఉండగా 26 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపే ఉన్నారు. అదే విధంగా సూర్యాపేట మున్సిపాలిటీలో కూడా బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధమైంది. కౌన్సిలర్లంతా సంతకాలు చేసిన తీర్మానం కాపీని కలెక్టర్‌కు అందజేయగా 27న అవిశ్వాస సమావేశం నిర్వహించనున్నట్లు కౌన్సిలర్లకు అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే బీఆర్ఎస్ కౌన్సిలర్లు 30 మంది ఉండగా వారు రెండు వర్గాలుగా విడిపోయారు. ప్రస్తుతం 9 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉండగా, బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ వారితో కలిసి అవిశ్వాసానికి తెరలేపారు. మరో 15 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి హైదరాబాద్ క్యాంపునకు తరలించారు.

అయోధ్యకు బయలుదేరిన పీఠాధిపతి



సాయిధామం పీఠాధిపతి రామానంద ప్రభూజీని అయోధ్యకు సాగనంపుతున్న భక్తులు

బొమ్మలరామారం : అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి బొమ్మలరామారం మండలం పెద్దపర్వతాపూర్‌లోని సాయిధామం పీఠాధిపతి శ్రీ రామానంద ప్రభూజీ గురువారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా రామభక్తులు సాయిధామానికి వచ్చి ప్రభూజీని సాగనంపారు. ఈ సందర్భంగా రామానంద ప్రభూజీ మాట్లాడుతూ ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని గౌరవించాలని, అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజు ఆలయాలు, ఇళ్లలో పూజలు నిర్వహించాలని కోరారు. రాత్రి సమయంలో ప్రతి ఇంట్లో ఐదు దీపం ప్రమిదలు వెలిగించాలన్నారు. ఇదిలా ఉండగా అయోధ్య నుంచి ప్రభూజీకి ఆహ్వానం అందినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి బోయిని లత నర్సింహ, బొమ్మకంటి మల్లేషం, కీసర ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకటేష్, బల్‌రాం, రాంరెడ్డి, గోపి కృష్ణ, రాజు, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

రేపు నవోదయ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి
- జిల్లా నుంచి హాజరుకానున్న 805 మంది విద్యార్థులు

భువనగిరి : జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 20న అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణకు భువనగిరిలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఉన్నత పాఠశాల, యాదగిరిగుట్టలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, మోత్కూరు, రామన్నపేటలో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 805 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష జరగనుంది. పరీక్ష పర్యవేక్షణకు ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు సీఎల్ఓలను నియమించారు. వీరితో పాటు ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు.

గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి : డీఈఓ. నారాయణరెడ్డి

విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు. గంట ముందునుంచే సెంటర్లలోకి పంపిస్తామని, నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు. పరీక్ష నిబంధనలు పాటించాలన్నారు.

రామమందిరాన్ని రాజకీయం చేయొద్దు

- భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

భువనగిరి : అయోధ్యలో చేపట్టిన రామమందిరాన్ని విపక్షాలు రాజకీయం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నాయని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్‌వీఎస్ ఎస్.ప్రభాకర్ ఆరోపించారు. గురువార భువనగిరిలోని ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రామమందిరం విషయంలో దేశ ప్రజల మనోభావాలను దెబ్బతిసేలా పార్టీలు వ్యవహరిస్తున్నాయని, ప్రజల మనోభావాలతో అటలాడుకోవద్దని, గౌరవించడం నేర్చుకోవాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ప్రజలకు పార్టీ మరింత చేరువయ్యేలా బూత్ స్థాయిలో సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించి పార్టీ శ్రేణులను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం నూతన ఓటర్ల నమోదు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, వికాష్‌యాత్ర తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోంగిడి మనోహర్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గస్థాయి నాయకులు అరుట్ల దశమంతరెడ్డి, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి,పడాల శ్రీనివాస్, చలమల్ల కృష్ణారెడ్డి, మొగిలయ్య, పాశం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలి

- క్రైం అడిషనల్ డీసీపీ అరవింద్‌బాబు




మాట్లాడుతున్న క్రైం అడిషనల్ డీసీపీ

భువనగిరి క్రైం : శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని రాచకొండ కమిషనరేట్ క్రైం అడిషనల్ డీసీపీ అరవింద్‌బాబు పేర్కొన్నారు. భువనగిరిలో గురువారం జరిగిన డివిజన్ స్థాయి పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలసి ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు పోతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. సెల్‌ఫోన్‌లకు వచ్చిన ఓటీపీలను ఇతరులకు పంపరాదని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, ఏసీపీలు వెంకట్‌రెడ్డి, శివరాంరెడ్డి, సీఐలు సుధీర్ కృష్ణ, సీఐ సత్యనారాయణ, అర్జునయ్య, ఎస్ఐలు సంతోష్‌కుమార్, యుగేందర్, నాగరాజు, కె.అరుణ్‌కుమార్, వీరస్వామి, కృష్ణస్వామి, ఏఎస్ఐ చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



పాశం భాస్కర్, జిల్లా అధ్యక్షుడు



దొంతి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు

సాక్షి, యాదాద్రి : భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడిగా భువనగిరికి చెందిన పాశం భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఏబీవీపీ నాయకుడిగా జీవితాన్ని ప్రారంభించిన భాస్కర్.. భువనగిరి డిగ్రీ కళాశాల అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం బీఎంఎస్‌లో కార్మిక సంఘం నేతగా రాణించారు. బీజేపీ పూర్తిస్థాయి నాయకుడిగా ఎదిగారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా, రెండుసార్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా అధ్యక్షుడిగా ఆరేళ్లు కొనసాగిన పీవీ

నూతన జిల్లా ఆవిర్భావంతో బీబీనగర్‌కు చెందిన పీవీ శ్యాంసుందర్‌రావు అధ్యక్షుడిగా నియమితులయ్యారు. 2016 డిసెంబర్‌లో బాధ్యతలు చేపట్టిన ఆయన పలుపోరాటాలు నిర్వహించారు. ముస్లింలకు 6 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట ర్యాలీ చేపట్టిన సందర్భంగా ఐదు రోజులు జైల్‌లో ఉన్నారు. మూసీ ప్రక్షాళన కోసం మూసీ జన్మస్థలం నుంచి కృష్ణానదిలో కలిసే వాడపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఎయిమ్స్‌కోసం ధర్నాలు చేశారు. పార్టీ పిలుపు మేరకు రాష్ట్రస్థాయి నేతలతో కలిసి గాంధీ సంకల్ప్ యాత్ర, ప్రజా సంగ్రామ యాత్రలు నిర్వహించారు. డబుల్‌బెడ్ రూం ఇళ్ల కోసం ధర్నాలు, బొమ్మలరామారం నుంచి కొండమడుగు వరకు, సంగెం నుంచి చిన్న కొండూరు వరకు రోడ్లకోసం పాదయాత్రలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆరేళ్ల పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసే అవకాశం కల్పించిన బీజేపీ నాయకత్వానికి, జిల్లాలో తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యక్షుడిగా నర్సింహారెడ్డి

మోత్కూరు : బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మోత్కూరుకు చెందిన దొంతి నర్సింహారెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

యాదాద్రిలో గజవాహన సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి,అమ్మవార్లకు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. భక్తులు ఆయా వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

రంగురాళ్ల వ్యాపారుల బైండోవర్

అడవిదేవులపల్లి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రంగురాళ్ల (గుండ్రాళ్లు) వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు వారిని తహసీల్దార్ సురేష్‌కుమార్ ఎదుట గురువారం బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ జిలాని మాట్లాడుతూ ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పిల్లి వెంకటేశ్వర్లు, కొమ్ము మల్లయ్య, తుమ్మల కొండలు గ్రామ శివారులో ప్రవహిస్తున్న కృష్ణా నది నుంచి రంగురాళ్లను ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారనే అభియోగాలపై వీరిని తహసీల్దార్ ఎదుట రూ.లక్ష పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా రంగురాళ్ల దందా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

చౌటుప్పల్: మున్సిపాలిటీ శివారులో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామానికి చెందిన సంగెం చంద్రశేఖర్(28) ద్విచక్ర వాహనంపై బుధవారం అర్ధరాత్రి దాటాక 2:30 గంటల ప్రాంతంలో విజయవాడ మార్గం గుండా వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణ శివారులో ఉన్న మల్లిఖార్జున వేబ్రిడ్జి ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. మృతుడి అన్న వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ్య తెలిపారు.

దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీ



దుకాణాలు తనిఖీ చేస్తున్న అధికారులు

కోదాడ: తూనికలు, కొలతల్లో వ్యాపారులు వినియోగదారులను మోసం చేయొద్దని, కచ్చితమైన తూకాన్ని పాటించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కోదాడలో పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. వినియోగదారులు వస్తువుల కొనుగోలు చేసే సమయంలో తుకాన్ని సరి చూసుకోవాలన్నారు. కాంటాలను వ్యాపారులు రెన్యూవల్ చేయించుకోవాలని చెప్పారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న డబ్బులు అప్పగింత

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో గురువారం బస్సు ఎక్కే క్రమంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బండారు రాకేష్, పగిళ్ల పవన్‌కు రూ.40వేలు దొరికాయి. ఆ డబ్బులను విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ రాఘవేంద్రకు అప్పగించారు. ఎస్ఐ సీసీ కెమెరా పుటేజీలో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కొత్తగూడెం గ్రామానికి చెందిన ముత్యాలు డబ్బులుగా గుర్తించారు. అతడిని స్టేషన్‌కు పిలిపించి నగదును అందజేశారు. నిజాయతీగా వ్యవహరించిన విద్యార్థులను ఎస్ఐ శాలువా కప్పి అభినందించారు.

లారీ డ్రైవరే హంతకుడు

- ఇనుప సామాను దుకాణ యజమాని హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన రాచకొండ కమిషనరేట్ క్రైమ్ అడిషనల్ డీసీపీ



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ కమిషనరేట్ క్రైమ్ అడిషనల్ డీసీపీ అరవింద్ బాబు

భువనగిరి క్రైం, మోత్కూర్ : మోత్కూర్‌లో సోమవారం పాత ఇనుప సామాను దుకాణ యజమాని మహ్మద్ కలీమొద్దీన్ హత్యకు గురికాగా.. ఈ కేసును పోలీసులు ఛేదించారు. గతంలో అతడి వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేసిన సిరిపాటి కిరణ్ అనే వ్యక్తి హత్య జరిగిన రోజు ఇనుప సామాను దుకాణంలో కిరణ్ స్క్రాప్‌ను అమ్మడంతోపాటు, గతంలో ఇతడిపై పాత కేసులు ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. రాచకొండ కమిషనరేట్ క్రైమ్ అడిషనల్ డీసీపీ అరవింద్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణం జలీల్‌పురకు చెందిన మహ్మద్ కలీమొద్దీన్(65) మోత్కూర్ మండల కేంద్రంలో పాత ఇనుప సామాను వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 15న కిరణ్ పాత ఇనుప సామాను తీసుకువెళ్లి అమ్మగా రూ.800 వచ్చాయి. అయితే కలీముద్దీన్ వద్ద డబ్బులు ఉండడాన్ని అతను గమనించాడు. మద్యం సేవించి, సాయంత్రం 4 గంటల ప్రాంతంలో బల్లపై నిద్రిస్తున్న కలీమొద్దీన్ వద్దకు వెళ్లి అతడి తలపై పారతో బలంగా కొట్టాడు. చనిపోయాడో.. లేదోనన్న అనుమానంతో పక్కనే ఉన్న ఇనుప సుత్తితో కలీమొద్దీన్ ఎడమ చెవివద్ద బలంగా కొట్టి అతని జేబులో ఉన్న రూ.2100 తీసుకున్నాడు. అందులో నుంచి రూ.800 ఖర్చు చేయగా.. మిగిలిన రూ.1300 నగదును, హత్యకు ఉపయోగించిన ఇనుప పార, సుత్తిని సీజ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూర్ మండలం, హన్మాపురం గ్రామానికి చెందిన కిరణ్ గతంలో ఖమ్మం జిల్లాలో తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో లారీలోని బీర్ లోడ్ నుంచి రెండు కాటన్‌లు దొంగిలించి అమ్ముకోగా మదిర జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. 2021లో చెంగిచర్ల కమాన్ వద్ద ఆటోను దొంగిలించిన కేసులో చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించాడు. పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాలమేరకు డీసీపీ రాజేష్ చంద్ర, ఇన్‌చార్జ్ డీసీపీ అరవింద్‌బాబు పర్యవేక్షణలో అడిషనల్ డీసీపీ రవికుమార్, ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరాం, మోత్కూర్ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి నిందితుడిని అరెస్టు చేశారు.

రైలు కిందపడి బీటెక్ విద్యార్థిని మృతి



మేఘన (ఫైల్)

బీబీనగర్: మండల కేంద్రంలోని రంగాపురం సమీపంలో దిగువ మెయిన్ లైన్ పట్టాలపై రైలుకింద పడి ఓ బీటెక్ విద్యార్థిని అత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. రైల్వే ఎస్ఐ సాలకమ్మ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం అనంతారం గ్రామానికి చెందిన గుర్రం లక్ష్మారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి బీబీనగర్‌లోని ఓ అద్దె ఇంట్లో కొంత కాలంగా నివాసముంటున్నారు. లక్ష్మారెడ్డి చిన్న కుమార్తె మేఘనారెడ్డి (19) ఘట్‌కేసర్ సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతోంది. బుధవారం సాయంత్రం బేకరీకి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన మేఘన రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినప్పటికీ ఆచూకీ తెలియలేదు. దీంతో మేఘన తండ్రి లక్ష్మారెడ్డి గురువారం మధ్యాహ్నం బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో తన కూతురు తప్పిపోయినట్లు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ యుగేందర్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

మృతదేహం లభ్యం కావడంతో వెలుగులోకి..

రంగాపురం సమీపంలోని కిలోమీటర్ నంబర్ 225 వద్ద రైలు పట్టాలపై గురువారం తెల్లవారుజామున యువతి మృతదేహం లభ్యమైంది. సంఘటనా స్థలంలో ఎలాంటి చిరునామా ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా భావించి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం విద్యార్థి మృతి చెందిన వార్తను రైల్వే పోలీస్‌లు ప్రెస్‌కు రీలీజ్ చేయడం, మృతదేహం ఫొటోలు సోషల్ మీడియాలో వస్తుండగా మేఘనగా గుర్తించిన స్థానికులు, స్నేహితులు కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి వెళ్లి చూడగా తమ కూతురేనని నిర్ధారణ కావడంతో కన్నీరు మున్నీరయ్యారు. కాగా.. మేఘన అత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై విచారణ చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

భార్యను హత్య చేసిన కేసులో జీవిత ఖైదు

చివ్వెంల(సూర్యాపేట): భార్యను హత్య చేసిన ఘటనలో భర్తకు జీవితఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ గురువారం తీర్పు వెల్లడించారు. హుజూర్‌నగర్ మండలం లక్కవల్లి గ్రామానికి చెందిన బొమ్మగాని సైదులు తన కుమార్తె లావణ్యను, మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన రాగిరి లింగన్నకు ఇచ్చి 2013లో వివాహం జరిపించాడు. పెళ్లికి ముందు గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న లింగన్న తన భార్యను శారీకంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీంతో లావణ్య జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు సర్దిచెప్పి తిరిగి అత్తగారింటికి పంపించారు. 2016 జూలైలో లింగన్న తన భార్యను ఎలాగైనా వదిలించుకుని, తాను ప్రేమించిన మహిళను వివాహం చేసుకోవాలని పథకం పన్నాడు. అదే నెలలో 7వ తేదీన మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో లావణ్య మెడకు బిగించి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న లావణ్య తండ్రి తన అల్లుడితో పాటు, అతడి తల్లి సూరమ్మ,, మరో మహిళ ఆకుల ఉమపై ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ దండ లక్ష్మణ్ ఆదేశాల మేరకు అప్పటి ఎస్ఐ అభిలాష్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ మృతురాలి భర్త లింగన్నకు జీవితఖైదుతో పాటు, రూ.5 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసులో ఉన్న ఇద్దరు మహిళలపై ఎలాంటి సాక్షాధారాలు లేనందున వారిని నిర్దోషులుగా తీర్పు చెప్పారు. పీపీకి లైజన్ ఆఫీసర్ సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ చంద్రశేఖర్ సహకరించారు.

గోవా మద్యం పట్టివేత

- ఒకరు అరెస్టు.. పరారీలో మరొకరు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: గోవా నుంచి అక్రమంగా మద్యాన్ని తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తి ఇంటిపై పోలీసులు దాడి చేశారు. జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ చాణక్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీలో నివాసముంటున్న పున్నా శివ, పున్నా రాకేష్‌లు గోవా నుంచి తక్కువ ధరలకు మద్యం తీసుకువచ్చారు. స్థానికంగా ఉన్న బెల్ట్ దుకాణంలో ఈ మద్యంను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ సీఐ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గోవాకు చెందిన 45 మద్యం ఫుల్ బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పున్నా శివను అరెస్టు చేయగా మరో నిందితుడు రాకేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన శివను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ మద్యం విలువ సుమారు రూ.65వేలు ఉంటుందని సమాచారం. దాడుల్లో ఎస్ఐలు రామకృష్ణ, ఎస్‌కె పర్వీన్, వై.లావణ్యతో పాటు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు



కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రుడు

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వెళ్తున్న కారు అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని గుంజలూరు గ్రామ శివారులో విజయవాడ- హైదరాబాద్ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన ఉప్పలూరు రిషి, గుండిమేడ మురళి, కృష్ణలు విజయవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో కంపెనీ పని నిమిత్తం హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా మార్గమధ్యలో గుంజలూరు గ్రామ శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇరువురికి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను స్థానికులు సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంలో వాహనాలను పక్కకు తీయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. అతి వేగమే ప్రమదానికి కారణమని తెలుస్తోంది.

చెరువులో పడి వ్యక్తి మృతి



యడ్ల ముత్తయ్య (ఫైల్)

పెన్‌పహాడ్: గేదెలను మేపేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యడ్ల ముత్తయ్య(50) గాయం నర్సిరెడ్డి దగ్గర పాలేరుగా పనిచేస్తున్నాడు. రైతుకు చెందిన గేదెలను మేపేందుకు బుధవారం గ్రామ శివారులోని చెరువు వద్దకు తోలుకెళ్లాడు. వాటిని మేపుతున్న సమయంలో గేదెలు చెరువు నీటిలోకి వెళ్లగా బయటకు తీసుకురావడానికి ముత్తయ్య నీటిలోకి దిగాడు. కాళ్లకు నాచు తట్టడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి సోదరుడు యడ్ల బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహం కావడం లేదని జమ్మిచెట్టుకు పూజలు

- పెద్దకందుకూరులో వివాదానికి దారితీసిన ఘటన

యాదగిరిగుట్ట రూరల్: వివాహం కావడం లేదని ఓ యువకుడి కుటుంబం జమ్మి చెట్టుకు పూజలు చేయడంతో వివాదానికి దారితీసింది. యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు గ్రామానికి చెందిన కోకల సందీప్‌తో, పాటుగా మరో ముగ్గురు కలిసి కొన్ని రోజులుగా రాత్రి సమయంలో గ్రామంలోని జమ్మిచెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామస్తులు ఓ రోజు కాపు కాసి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా.. ఇద్దరు పట్టుబడ్డారు. మరో ముగ్గురు పరారయ్యారు. అయితే గత నెల రోజుల నుంచి గ్రామంలో 10 మంది చనిపోయారని, ఈ పూజలే కారణమని అనుమానిస్తూ.. మరుసటి రోజు పూజలు నిర్వహిస్తున్న వారిని గ్రామ పంచాయతీకి పిలిపించారు. అందుకు కోకల సందీప్ రావడానికి నిరాకరించాడు. తనకు వివాహం కావడం లేదని, గత కొన్ని రోజులుగా తాను పూజలు చేస్తుంటే, గ్రామస్తులు తమను తప్పుగా భావించి కొట్టడానికి వచ్చారని ఫిర్యాదు చేశాడు. దీంతో గురువారం పోలీస్‌స్టేషన్‌కు గ్రామస్తులు రాగా.. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. సీఐ రమేష్ జోక్యం చేసుకుని మూఢ నమ్మకాలను నమ్మొద్దని తెలిపారు. సందీప్ కేవలం వివాహం కోసం మాత్రమే పూజలు చేస్తున్నాడని, ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

పీడీఎస్ బియ్యం లబ్ధిదారులకు చేరాలి

సూర్యాపేట క్రైం: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పీడీఎస్ బియ్యం అందిస్తుందని ఎస్పీ రాహుల్ హెగ్డే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీడీఎస్ బియ్యం అమ్మకాలు జరిపినా, రీసైక్లింగ్ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణాను అరికట్టడానికి సమన్వయంతో నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. బియ్యం అందించే మిల్లర్లపై, అంతరాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్‌పై పోలీసు నిఘా ఉందని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరడానికి ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ రేషన్ డీలర్లు, మిల్లర్లు బాధ్యతగా పనిచేయాలని పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ

బీబీనగర్: మండలంలోని జైనపల్లి గ్రామంలో గల శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని గర్భగుడి తాళాలను పగులగొట్టి సుమారు రెండు తులాల బంగారు అభరణాలతో పాటు హుండీలోని నగదును అపహరించుకుపోయినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ యుగేందర్ ఆలయానికి చేరుకొని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలలో బ్యాటరీలు, ఇన్వర్టర్ చోరీ

ఆత్మకూర్(ఎస్) (సూర్యాపేట): ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 బ్యాటరీలు, ఇన్వర్టర్ చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు కాగా గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి చూడగా ఐదు బ్యాటరీలు, ఇన్వర్టర్ లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కట్టా వెంకటరెడ్డి తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్, ఎస్‌టీఎఫ్ హైదరాబాద్, డీటీఎఫ్ సూర్యాపేట అధికారులు సంయుక్తంగా గురువారం నియోజకవర్గంలో దాడులు నిర్వహించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఎక్సైజ్ సీఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం కల్మెట్‌తండా, బెట్టతండా, గరిడేపల్లి మండలం మంగాపురంలలో దాడులు చేసి రూపావత్ బద్య, ధీరావత్ పార్వతి, ధరావత్ సుజాతలను అరెస్ట్ చేశారు. వారి నుంచి 15 లీటర్ల సారా, 10 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి ఉపయోగించే 300 బెల్లం పానకం ధ్వంసం చేశారు. గరిడేపల్లి మండలం రేగులగడ్డ తండాలో దాడులు చేయగా బాణోతు పకీర, బాణోతు మమతలు పారిపోయారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్, ఎస్‌టీఎఫ్, డీటీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిహార్ కూలీ ఆత్మహత్య

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన అజిత్‌కుమార్ పాశ్వాన్ స్థానికంగా కూలి పని చేసుకుంటూ అనంతారం మోడల్ స్కూల్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నివసిస్తున్నాడు. కుటుంబ తగాదాలతో బిహార్‌లో ఉన్న భార్యతో ఈ నెల 15న ఫోన్‌లో వాగ్వాదానికి దిగాడు. దీంతో భార్య అక్కడ ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంపై బంధువులు పాశ్వాన్‌కు సమాచారం అందించగా పాశ్వాన్ పక్కనే ఉన్న విద్యుత్ తీగలను పట్టుకొని చనిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తుంగతుర్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్: హైదరాబాద్- విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. హైదరాబాద్ మార్గంలో గురువారం వాహనాలు పెద్దసంఖ్యలో వెళ్లాయి. పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ మార్గంలో 10టోల్‌బూత్‌లను కేటాయించి వాహనాలను పంపిస్తున్నారు. ఆదివారం వరకు రద్దీ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఆదివారం వరకు రద్దీ కొనసాగే అవకాశం..

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈనెల 12నుంచి 14వరకు విజయవాడ మార్గంలో వాహనాల రద్దీ కొనసాగింది. 12వ తేదీన 68వేల వాహనాలు, 13న 85వేలు, 14న భోగి రోజున 15వేల వరకు వాహనాలు టోల్‌ప్లాజా వద్ద రాకపోకలు సాగించాయి. అదేవిధంగా 16వ తేదీన 45వేల వాహనాలు, 17న 60వేలు, 18న సుమారుగా 38వేల వరకు హైదరాబాద్ వైపునకు వెళ్లాయి. ఈ ప్రకారంగా ఇంకా వాహనాలు రావాల్సి ఉంది. ఇంకా స్వగ్రామాల్లోనే ఉండిపోయిన ప్రజానీకం ఆదివారం వరకు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

25 కేంద్రాలు.. 4,623 మంది విద్యార్థులు

రేపు జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశపరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షకు నో ఎంట్రీ
- ఓఎంఆర్ విధానంలో పరీక్ష



చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం

పెద్దవూర: పెద్దవూర మండలం చలకుర్తి క్యాంపులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించనున్న పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్షకు 4,623 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2672 మంది బాలురు, 1950 మంది బాలికలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. యాదాద్రి జిల్లాలో 805 మంది, సూర్యాపేట జిల్లాలో 1564 మంది, నల్లగొండ జిల్లాలో 2254 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకుగాను 15 బ్లాక్‌లలో మొత్తం 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లాలో 12, భువనగిరి యాదాద్రిలో 5, సూర్యాపేట జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆరవ తరగతిలో 80 సీట్లు..

ఆరవ తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. ఈ సీట్లలో 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించారు. ఇందులో ఎస్సీలకు 15 ఎస్టీలకు, 7.5 శాతం ఎస్టీలకు, 3 శాతం దివ్యాంగులకు, 27 ఓబీసీలకు, మొత్తం సీట్లలో బాలికలకు 33 శాతం సీట్లు మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. పరీక్ష వ్యవధి మొత్తం 2 గంటలు ఉంటుంది. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులు ఉదయం 10.30 లోగా చేరుకోవాలని ప్రిన్సిపాల్ నాగభూషణం సూచించారు. 11 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అదనంగా మరో 40 నిమిషాల సమయం అనుమతించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారానే హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మూడు విభాగాల్లో పరీక్ష

ప్రవేశ పరీక్ష వంద మార్కులకు 80 ప్రశ్నలతో ప్రశ్నపత్రం ఉంటుంది. మూడు విభాగాల్లో ఈ ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కు ఉంటుంది. రీజనింగ్ మేధాశక్తిలో 50 మార్కులకు 40 ప్రశ్నలు, గణితంలో 25 మార్కులకు 20 ప్రశ్నలు, తెలుగు లేదా ఇంగ్లిష్‌లో ఐదు ప్యాసేజీలు ఉంటాయి. ఒక్కో ప్యాసేజీకు నాలుగు ప్రశ్నల చొప్పున ఉంటాయి. వీటికి 25 మార్కులు ఉంటాయి. మేధాశక్తి విభాగంలో 50 మార్కులు ఉంటాయి.

విద్యార్థులకు సూచనలు

- అడ్మిట్ కార్డు లేకుండా విద్యార్థులను పరీక్షకు అనుమతించరు.
- అడ్మిట్ కార్డులోని వివరాలను జాగ్రత్తగా తనిఖీ చేసుకోవాలి.
- పరీక్షా హాల్‌లో సాధారణ చేతి గడియారం మినహా ఎలక్ట్రానిక్ పరికరాలు/గాడ్జెట్‌లు అనుమతించబడవు.
- పరీక్షా హాల్‌లోకి అడ్మిట్ కార్డు, బ్లాక్/బ్లూ పెన్నులు మినహా ఏ వస్తువులను తీసుకెళ్లరాదు.
- బ్లాక్, నీలం రంగు పెన్నులతో మాత్రమే సమాధానాలు రాయాలి.
- పెన్సిల్‌ను ఉపయోగించరాదు.
- అడ్మిట్ కార్డులో పేర్కొన్న అదే పరీక్షా మాధ్యమం ప్రశ్నాపత్రాన్ని అందిస్తారు.
- అభ్యర్థులు ఓఎంఆర్ షీటుతో పాటు ప్రశ్నపత్రంపై హాల్ టిక్కెట్ నంబరు వేయాలి.
- టెస్ట్ బుక్‌లెట్‌పై ముద్రించిన టెస్ట్ బుక్‌లెట్ నంబర్, సీరీస్, సమాధాన పత్రం సైడ్-2పైన ఉన్న టెస్ట్ బుక్‌లెట్ నంబర్, టెస్ట్ బుక్‌లెట్ సీరీస్ ఒకే విధంగా ఉన్నదో లేదో సరిచూసుకోవాలి.
- ప్రశ్నకు సంబంధించిన బాక్స్‌లో సమాధానాన్ని పెన్నుతో బబ్లింగ్ చేయాలి.
- వైట్ ఫ్లూయిడ్ గాని కరెక్షన్ ఫ్లూయిడ్‌లను ఉపయోగించకూడదు.
- ఓఎంఆర్ షీటుపై దిద్దుట, కొట్టివేయుట, తుడుపుట వంటివి చేయకూడదు. ఏ రకమైన గీతలు, గుర్తులు పెట్టొద్దు.
- రఫ్ వర్క్‌కు సమాధాన పత్రం ఉపయోగించకూడదు.
- అభ్యర్థులు 1.30 గంటకు ముందు హాల్ నుంచి బయటకు వెళ్లటానికి వీలు లేదు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం జరి పించారు. అదేవిధంగా శ్రీలక్ష్మి నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖ మండపంలో ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మాంగల్యధారణ గావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి

సూర్యాపేట క్రైం: సైబర్ మోసాలు, నివారణపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు గురువారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ మోసాలపై కేసుల నమోదు, దర్యాప్తు అంశాలపై సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు శివశంకర్, అశోక్, మురారి, రాజశేఖర్, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.